క్లుప్తంగా

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పర్యటన

రాజోలు: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ గురువారం వేగివారిపాలెంలో జరిగే సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు జీసస్ క్రీస్ట్ ప్రేయర్ హౌస్‌లో జరిగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని అనంతరం జై భీమ్ సేవా స్రవంతి లోగోను ఆవిష్కరిస్తారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం

మామిడికుదురు: సర్వ శిక్షా అభియాన్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు వినతి పత్రం అందించారు. తమను రెగ్యులర్ చేయాలని సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన వేతనం ఇవ్వాలని వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేసి హెల్త్ స్కీంను అమలు చేయాలని కోరారు. వారిలో బక్కుల శ్రీనివాస్, గాలిదేవర రామకృష్ణ, యెరుబండి మధు, మెహదీ ఉన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ నాతిబుజ్జి తెలిపారు. ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

పాఠశాలకు ఆట పరికరం బహూకరణ



దాత రాజేశ్వరరావు బహూకరించిన ఊయల

రాజోలు: చదువుకున్న పాఠశాలకు తన సోదరి కామరుసు వెంకట సుందర రంగనాయకమ్మ జ్ఞాపకార్థం కస్తూరి రాజేశ్వరరావు రూ.30 వేలు విలువ చేసే ఆట పరికరం (మేరిగో రౌండ్)ను బుధవారం బహూకరించారు. ఎంఈఓ మనోహరం అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. చిన్నారుల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. హెచ్ఎం కడలి నాగపద్మావతి, ఎంఈఓ–2 ప్రసాదరావు, ఉపాధ్యాయులు సయ్యద్ రూహీ, మల్లాడి శ్రీనివాసరావు, పీఎస్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



బాలసుబ్రహ్మణ్యం (ఫైల్)

అంబాజీపేట: కె.పెదపూడిలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కొండ బాలసుబ్రహ్మణ్యం(బాబి)(41) మంగళవారాత్రి గుండె పోటుతో మృతి చెందారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలసుబ్రహ్మణ్యానికి మంగళవారం రాత్రి ఛాతీలో నెప్పివచ్చింది. 108 వెళ్లే సరికి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరించే బాలసుబ్రహ్మణ్యం ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపై ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

సీతారామచంద్రుడికి లక్ష తులసి పూజ

అంబాజీపేట: స్థానిక పెద్దవీధిలో ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజ నిర్వహించారు. యర్రాప్రగడ సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులతో ఈ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం బాలభోగ నివేదన, ప్రసాద వితరణ, రాజభోగ నివేదన, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'చెకుముకి'లో విద్యార్థుల ప్రతిభ



చెకుముకి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

రావులపాలెం: మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని స్థానిక సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు బుధవారం తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వివిధ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందించారు. పి.సూర్య నాగిరెడ్డి రెండో స్థానం, కె.రాగ సుస్మిత రెండో స్థానం, వై. సహస్ర రెండో స్థానం, బి.హారిక ఆదిలక్ష్మి మూడో స్థానం, పి.శంకర్ మూడో స్థానం, ఎం.లాస్యశ్రీ మూడోస్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ముల్లారావు, ఏఓ ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆశీర్వాదం తదితరులు విద్యార్థులను అభినందించారు.



కొత్తపేటలో బ్యాడ్మింటన్‌లో పోటీపడుతున్న యువకులు



వీరవల్లిపాలెంలో క్రీడాకారులతో ఎంఎల్‌డీఓ ప్రభాకరరావు



వక్కలంకలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ రేవతి



పినపళ్లలో కబడ్డీ పోటీలకు తలపడుతున్న క్రీడాకారులు

ఉప్పొంగిన క్రీడోత్సాహం

- గ్రామాల్లో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు
- విద్యార్థుల నుంచి విశేష స్పందన



మొగలికుదురులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

కొత్తపేట: గ్రామాల్లో క్రీడోత్సాహం ఉప్పొంగింది. ప్రతి గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టగా, నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలకు కనీవినీ ఎరుగని రీతిలో విశేష స్పందన లభిస్తోంది. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి ఐదు దశల్లో 47 రోజులు సాగే క్రీడల్లో 15ఏళ్లు పైబడిన బాల, బాలికలందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లోని 87 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడాపోటీలు జరుగుతున్నాయి. సచివాలయాల స్థాయిలో వచ్చే నెల 10 వరకూ జరగనున్నాయి. కొత్తపేట మండలంలో మొత్తం 533 టీమ్‌లలో 2,467 మంది పురుషులు, 1,611 మంది మహిళలు పాల్గొంటున్నారు. క్రికెట్‌కు సంబంధించి 112 మహిళలు, పురుషుల టీమ్‌లలో పురుషులు 976 మంది, మహిళలు 465 మంది పాల్గొంటున్నారు. 155 బ్యాడ్మింటన్ టీమ్‌లలో 188 మంది పురుషులు, 122 మంది మహిళలు, 100 వాలీబాల్ టీమ్‌లలో 514 మంది పురుషులు, 279 మంది మహిళలు, 82 కబడ్డీ టీమ్‌లలో 370 మంది పురుషులు, 306 మంది మహిళలు, 84 ఖోఖో టీమ్‌లలో 419 మంది పురుషులు, 439 మంది మహిళలు ఉన్నారు. ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి, పీడీలు, పీఈటీలు, గ్రామ కార్యదర్శులు ప్రభుత్వ లక్ష్యం మేరకు పై క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సచివాలయం–3 కార్యదర్శి ఎస్.హరిప్రసాద్‌బాబు, ఎంఎస్‌డీఓ ఉషారాణి ఆధ్వర్యంలో రెండోరోజు బుధవారం క్రీడా పోటీలను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు ప్రారంభించారు. ఆ ప్రాంగణంలో బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎస్ఎస్ పీఓ పాపారావు, అధ్యాపకులు, పీడీలు, పీఈటీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అమలు చేసిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మొగలికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి అభినందనలు తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడు తాడి శేఖర్, కడి శ్రీను పాల్గొన్నారు.

అంబాజీపేట: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించి, వారిని ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసంశెట్టి పెదబాబులు అన్నారు. వక్కలంకలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్‌లను సచివాలయ సిబ్బందికి అందించారు. అనంతరం క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం రెండవ రోజు అదే జోరు కొనసాగింది. మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రాధాన్యత క్రమాన్ని బట్టి క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాట్మింటన్ పోటీలను నిర్వహించారు. గ్రామ స్థాయిలో చక్కని ప్రతిభను కనబర్చిన క్రీడాకారుల వివరాలను మండల స్థాయి అధికారులకు అందజేశారు. పంచాయతీ సర్పంచులు, కార్యదర్శుల పర్యవేక్షణలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం, ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంఎల్‌డీఓ ఎం.ప్రభాకరరావు పరిశీలించారు. ప్రతి చోట గ్రామస్తులు క్రీడలపై ఆసక్తి కనబర్చుతున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, వీరవల్లిపాలెం పంచాయతీ కార్యదర్శి జి.రవి తదితరులు ఉన్నారు.

జలజీవన్‌తో ఇంటింటికీ కుళాయిలు

- ఎమ్మెల్యే రాపాక
- వాటర్ ట్యాంకు, పైపులైన్లకు శంకుస్థాపన



కేశనపల్లిలో తాగునీటి ట్యాంకు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జల జీవన్ పథకంతో గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు వేయడంతో తాగునీటి సమస్యల పరిష్కారమవుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మలికిపురం మండలం కేశనపల్లి, పడమటిపాలెం, తూర్పుపాలెం గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన వాటర్ ట్యాంక్, పైపులైన్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ జలజీవన్ పథకం రాజోలు నియోజకవర్గానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చుట్టూ సముద్రంతో పాటు ఉప్పునీటి సమస్యల తీవ్రంగా ఉన్న సముద్ర తీర గ్రామాలకు వరంగా ఈ పథకం నిలిచిందన్నారు. ప్రభుత్వం ద్వారా పూర్తి స్థాయిలో నిధులు తెచ్చి పనులు పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. అడిగిన వారం దరికీ ఇంటింటికీ కుళాయి వేస్తున్నామని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బళ్ళ ప్రసన్న కుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, మలికిపురం మండల వైఎస్సార్‌సీపీ ప్రెసిడెంట్ అడబాల వీరబ్రాహ్మజీ, సర్పంచ్‌లు యెనుముల నాగు, గుర్లింక సత్తిబాబు, ఆకుల మాధవీ నాగలక్ష్మి, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, సుజాత, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి, నల్లి సత్యం, సుంకర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన



మడికిలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని మడికి గ్రామ సచివాలయం–3 పరిధిలో బుధవారం ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ యు.లక్ష్మీమానిక, పార్టీ నేతలు చెల్లుబోయిన శ్రీనివాసు, పడమట రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం వారి సమస్యలను తెలుసుకున్నారు.వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలుపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుని ఇంటికే నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తూ జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామంలో సుమారు రూ 14.64 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, దూలం సత్తిబాబు, దొండపాటి చంటి, యు.సుందరం విజయం, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, గ్రామ కార్యదర్శి కె.మోక్షాంజలి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం,పోసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.4.40 కోట్లు



వాడపాలెం మారెమ్మ ఆలయ కమిటీ సభ్యులకు నిధులు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నుంచి కొత్తపేట నియోజకవర్గంలో 44 ఆలయాల అభివృద్ధికి రూ 4.40 కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వాడపాలెం గ్రామ దేవత మారెమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం సీజీఎఫ్ గ్రాంట్ రూ.1.35 కోట్లు మంజూరు చేయించి, అందులో 1.80 కోట్లు ప్రభుత్వం అందిస్తుండగా మ్యాచింగ్ గ్రాంటుగా రూ.27 లక్షలు ఆలయ కమిటీ అందిస్తున్నట్టు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తెలిపారు. సంబంధిత మంజూరు పత్రాలను బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పులిదిండి వేణుగోపాలస్వామి వారి ఆలయం, గోపాలపురం శివాలయం, విష్ణాలయం, చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయాలకు సీజీఎఫ్ గ్రాంటు నుంచి నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఆ పార్టీ జిల్లా సభ్యుడు, ఆలయ కమిటీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, మండల మహిళా విభాగం కన్వీనర్ పోతుల చంద్రావతి, వాడపాలెం గ్రామ పార్టీ సభ్యుడు మిండిగుదిటి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



పీకే రావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే, కోకోనట్ అసోసియేషన్ అధ్యక్షుడు

అంబాజీపేట: ప్రస్తుత సమాజంలో ఉన్నత వర్గాలుగా చలామణి అవుతున్నప్పటికీ ఎంతోమంది బ్రాహ్మణులు పేదరికంలోనే ఉన్నారని, వారికి కార్పొరేషన్ నుంచి సాయమందించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఉభయ గోదావరి జిల్లాల కోకోనట్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దాల తమ్మారావు అన్నారు. కోనసీమ డ్రై కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావుకు బుధవారం రాత్రి స్థానిక ఏవీఆర్ అండ్ వైఎస్సార్ కల్యాణ మండపంలో సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ కార్యదర్శి అప్పన బాలాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఉభయ గోదావరి జిల్లాల కోకోనట్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దాల తమ్మారావు హాజరై మాట్లాడారు. పేద బ్రాహ్మణులకు న్యాయం చేసేలా కృషి చేయాలని కోరారు. అనంతరం సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టిబాబు, ఉభయ గోదావరి జిల్లాల అసోసియేషన్ అధ్యక్షుడు తమ్మారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు యర్రాప్రగడ సూరిబాబు, అప్పన కాశీ, గోకవరపు శివ, బొండాడ శివ, యర్రాప్రగడ సూర్యతేజ, అప్పన వాసు, నిట్టాల ఫణి తదితరులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరునికి లక్ష పత్రి పూజ

అయినవిల్లి: నేదునూరు సర్వమంగళ పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామివారికి బుధవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. పెండ్యాల చెరువుకు చెందిన గణేశుల వెంకటేశ్వరరావు పద్మావతి దంపతులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. సాయంత్రం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

మిరాకిల్, శాంతి సదన్ మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం



సైకిళ్లు పంపిణీ చేస్తున్న మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ

రాజోలు: మిరాకిల్ మినిస్ట్రీస్, శాంతి సదన్ మినిస్ట్రీస్ సేవలు అభినందనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం కడలి గ్రామంలో మిరాకిల్, శాంతి సదన్ మినిస్ట్రీస్ సంయుక్తంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో అమెరికా నుంచి తెచ్చిన కంటైనర్ వస్తువులను పంపిణీ చేశారు. కులాలకు, మతాలకు అతీతంగా అనేక మందికి సైకిళ్లు, గిఫ్ట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. మిరాకిల్ అధినేత వై.శ్రావణ్‌కుమార్, ఆయన సతీమణి సంధ్య, శాంతి సదన్ అధినేత శిరీష్ జాషువా అందిస్తున్న సేవలను జాన్‌వెస్లీ కొనియాడారు. కరోనా సమయంలో శ్రావణ్‌కుమార్ కుటుంబం అందజేసిన సాయాన్ని ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని గుడ్ సీడ్ ఫౌండేషన్ చైర్మన్ కుంచే రమణారావు అన్నారు. సర్పంచ్ చొప్పల గుణనాథ్, ఆర్అండ్‌బీ ఏఈ వై.శశిభూషణ్, కె.కిమ్‌నాథన్, డాక్టర్ జాషువా స్వరూప్, డీస్ రిచర్డ్స్ సుందర్‌బాబు, జి.ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా చెముడులంక

- రూ.మూడు కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు
- ఒకే రోజు 11 శిలాఫలకాలు ఆవిష్కరణ



చెముడులంకలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని చెముడులంక అభివృద్ధిలో జిల్లా స్థాయిలో అగ్రగామిగా కొనసాగుతుండడం అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో సుమారు రూ.మూడు కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రికార్డు స్థాయిలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌తో పాటు ఎనిమిది సీసీ రోడ్లు, మూడు డ్రైనేజీలకు సంబంధించి బుధవారం ఒకేసారి 11 శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించి, పనులు ప్రారంభించారు. సర్పంచ్ తమ్మన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని సుమారు రూ.పది కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు జరగాయన్నారు. గత మూడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మేజర్ డ్రైనేజీ సమస్య పరిష్కారమైందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు హిందూ దేవాలయాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. బడుగువానిలంకలో గ్రోయిన్ల నిర్మాణ పనులు చేసేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దియ్యన పెదకాపు, ఉప సర్పంచ్ దొండపాటి చంటి, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు, అడబాల వీర్రాజు, బులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేకాన్ని చేస్తున్న పురోహితులు

ఆలమూరు: స్థానిక పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయంలో బుధవారం అన్నాభిషేకం ఘనంగా జరిగింది. ఆలయ పురోహితులు కాళ్లకూరి సూరిపండు నేతృత్వంలో అర్చకుల బృందం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అన్నాభిషేకాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నసమారాధన జరిగింది. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

దుప్పట్ల పంపిణీ



అంతర్వేదిపాలెంలో చిన్నారులకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం ముస్లిం ఆశ్రమంలోని పిల్లలకు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. గొంది గ్రామానికి చెందిన సమైక్య ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాటిని అందజేశారు. ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు కుసుమ చంద్రశేఖర్, నల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థిని వడ్డి సుష్మకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.50,355 ఆర్థిక సాయం అందజేశారు. గుండె సంబంధిత సమస్యతతో బాధపడుతున్న సుష్మ పేస్ మేకర్ పరికరాన్ని అమర్చేందుకు ఆర్థిక సాయం అందించాలని పాఠశాల హెచ్‌ఎం ఎంజీకే శ్రీనివాస్‌ను ఆమె తల్లి కోరింది. దీంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు నగదును సమకూర్చారు. ఆ మొత్తాన్ని సుష్మకు అందజేశారు. ఎంఈవో డి.కిషోర్‌కుమార్, సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మీకిరణ్మయి, విద్యార్థి విభాగం ప్రతినిధి తాడి సహదేవ్ పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్టు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ పాలక మండలి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొంటారన్నారు.

హుండీల లెక్కింపు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందని ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి, ఉమా కమండేశ్వర స్వామి ఆలయాల్లో బుధవారం హుండీలను తెరిసి లెక్కించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో మూడు నెలలకు గాను హుండీల లెక్కించగా రూ 4,40,591, ఉమాకమండేశ్వర స్వామి ఆలయంలో హుండీల లెక్కించగా రూ.1,65,581 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం దేవదాయ ధర్మదాయశాఖ తనిఖీదారు జి.సత్య వరప్రసాద్ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబు, ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నగరం గ్రామానికి చెందిన తాడి రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమలాపురం షాదీఖానాలో బుధవారం జరిగిన సమావేశంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల నుంచి నేరుగా వేతనాలు అందించాలని, 2022 ఏప్రిల్ నుంచి రావాల్సిన ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని, మెడికల్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, పనికి తగ్గ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: వెదిరేశ్వరం గ్రామంలో పాస్టర్ రమేష్ బాబు నూతనంగా నిర్మించిన సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో ఆరాధన కార్యక్రమంలో బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

భవానీల కలశ పూజ

అయినవిల్లి: స్థానిక సత్తెమ్మతల్లి ఆలయం వద్ద మంగళవారం రాత్రి భవానీ భక్తులు కలశ పూజలు నిర్వహించారు. అమ్మవారికి సహస్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

10న వెబ్ సిరీస్ ఫిల్మ్ విడుదల

సఖినేటిపల్లి: జనవరి 10వ తేదీన వెబ్ సిరీస్ ఫిల్మ్ 'నిశి' విడుదల చేస్తున్నట్టు దర్శకుడు ప్రవీణ్ తిరునగరి అన్నారు. బుధవారం వీవీమెరకలో చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ విడుదల చేశారు. పీటీ స్క్రీన్ బ్యానర్‌పై దర్శకుడు ప్రవీణ్ దర్శకత్వంలో నిర్మించే నిశి థ్రిల్లర్ అండ్ హర్రర్ వెబ్ సిరీస్ ఫిల్మ్ మొదటి భాగం పూర్తయిన సందర్భంగా దీనిని విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన తెలిపారు. నిశి ఫిల్మ్ స్థానిక నటీనటులతో రూపొందించామని, వైవిధ్య భరితంగా సస్పెన్స్ థ్రిల్లర్‌గా కథ ఉంటుందన్నారు. అంతర్వేది, మలికిపురం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేసినట్టు తెలిపారు. హీరోయిన్‌గా అనిత కలిసేట్టి, ప్రధాన పాత్రల్లో మోరం నాయుడు, రాజ వర్ధన్, అనూష, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా గణపతి నటించారన్నారు.